క్లుప్తంగా

జాబ్ మేళాలో 29 మంది ఎంపిక



చెరుకుపల్లి: నిరుద్యోగులు అందివచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉపాధి పొందాలని ఇన్‌చార్జ్ డీఎల్‌పీవో శ్రీనివాసన్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన జాబ్ మేళాలో ఆయన పాల్గొని మాట్లాడారు. జాబ్ మేళాకు డాక్టస్ బిజినెస్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్, డైకిన్ ఎయిర్ కండిషనర్ ప్రతినిధులు అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి 51 మంది అభ్యర్థులు హాజరవ్వగా వీరిలో 29 మంది ఎంపికయ్యారని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి పి.ప్రణయ్ తెలిపారు. జాబ్ మేళాలో జిల్లా ప్లేస్‌మెంట్ అధికారి బి.శ్రీనివాస్, సంస్థ ప్రతినిధులు హారిక, స్కిల్ హబ్ కో ఆర్డినేటర్ హరీష్ తదితరులు పాల్గొన్నారు.

కాల్వ పూడిక సమస్య పరిష్కారం



భట్టిప్రోలు: భట్టిప్రోలు గ్రామంలో డంపింగ్ యార్డ్ ఎదురుగా పంచాయతీ డ్రైనేజీలో గుర్రపు డెక్కలు, గడ్డితో మునిగిపోవడంతో సమస్య పరిష్కరించినట్లు సర్పంచ్ దారా రవి కిరణ్మయి మంగళవారం తెలిపారు. డ్రైనేజీ నీటి పారుదల నిలుపుదల చేయడం వల్ల పక్కనే ఉన్న పంట పొలాల్లోకి మురుగు నీరు పార్లిపోవడం వల్ల రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సందర్భంగా ప్రొక్లెయినర్‌తో డ్రైనేజీలో గుర్రపు డెక్కలు, గడ్డిని తొలగించి, డ్రైనేజీ పూడిక తొలగించినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బుర్లె రామ ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి కె.శ్రీనివాసరావు, దారా చెన్నయ్య, రైతులు తదితరులు పాల్గొన్నారు.

తాగునీరు సక్రమంగా అందించాలి



పెదగొల్లపాలెం(కర్లపాలెం): వేసవి కాలంలో ప్రజలకు తాగునీటి ఎద్దడి రాకుండా సక్రమంగా అందించాలని జెడ్పీ సీఈవో ఒ.జ్యోతిబసు చెప్పారు. మంగళవారం పెదగొల్లపాలెం రక్షిత మంచినీటి పథకం చెరువును జెడ్పీ సీఈవో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెదగొల్లపాలెం రక్షిత మంచి నీటి పథకం పరిధిలోని గ్రామాలు సముద్రతీర ప్రాంతాన ఉండటం వలన తాగునీటి సరఫరాకు అంతరాయం కలగకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. మండల పరిధిలో ఉన్న అన్ని తాగునీటి చెరువులను పరిశీలించి ఆయా గ్రామాలకు తాగునీటి సరఫరా జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎ.శ్రీనివాసరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మజూర్ బాషా, ఈవోపీఆర్డీ ఐ.శ్రీనివాసరావు, పమిడి రవీంద్ర తదితరులు ఉన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు మజ్జిగ పంపిణీ

తెనాలిఅర్బన్: వేసవి తీవ్రతను దృష్టిలో పెట్టుకుని ఆర్టీసీ తెనాలి డిపో ఆధ్వర్యంలో మంగళవారం ఉద్యోగులకు మజ్జిగను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ గోపాల కృష్ణ మాట్లాడుతూ డ్రైవర్లు, కండెక్టర్‌లు వేసవి కాలంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎండ వేడి తగలకుండా తగ్గు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డిపో మేనేజర్ ఎ.రాజశేఖర్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం వేసవి కాలంలో ఉద్యోగులకు మజ్జిగ పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ ప్రసాద్, పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

నేడు క్షయవ్యాధిపై అవగాహన సదస్సు

కొల్లిపర(తెనాలి): మండల కేంద్రమైన కొల్లిపరలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో బుధవారం ఉదయం 10 గంటలకు టీబీ వ్యాధిపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించనున్నారు. ఎంఆర్ ఫ్యూచర్ ఫౌండేషన్, జిల్లా ఆరోగ్యశాఖ సంయుక్త నిర్వహణలో ఏర్పాటయే సమావేశంలో జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి ముఖ్యఅతిథిగా హాజరవుతారు. టీబీ వ్యాధిపై అవగాహనను కల్పించటమే కాకుండా టీబీ రోగులకు అవసరమైన పోషకాహార కిట్లను ఎంఆర్ ఫౌండేషన్ పంపిణీ చేయనుంది. పీఎంటీబీఎంబీఏ న్యూట్రిషన్ సపోర్ట్ ప్రోగ్రాంలో భాగంగా ఈ సదస్సును ఏర్పాటు చేసినట్టు ఎంఆర్ ఫ్యూచర్ ఫౌండేషన్ చైర్మన్, మేనేజింగ్ ట్రస్టీ మేఘనారెడ్డి కొల్లి మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేశారు.

వైద్యుల కొరత.. తీరని వెత

- అరకొర వైద్య సేవలతో సరి
- వివిధ కారణాలతో సెలవుపై వైద్యులు
- సకాలంలో వైద్యం అందక ప్రజల ఇబ్బందులు

వేమూరు: నియోజకవర్గంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల(పీహెచ్‌సీ)లో వైద్యుల కొరత వల్ల రోగులకు అరకొర వైద్య సేవలు అందిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో వైద్యుల కొరత నెలకొంది. ప్రస్తుతం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో పనిచేస్తున్న వైద్యులు వివిధ కారణాలతో సెలవుపై వెళ్లడంతో వైద్యుల కొరత ఏర్పడి ప్రజలకు సకాలంలో వైద్య సేవలు అందడం లేదు. దీంతో ప్రైవేటు ఆసుపత్రులకు వెళుతున్నారు. ప్రైవేటు ఆసుపత్రులలో వైద్య ఖర్చులు భరించలేక పేద ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. పీహెచ్‌సీల్లో పని చేస్తున్న వైద్యులు కొంత మంది పీజీ సీటు వచ్చిందని సెలవుపై వెళ్లడం, కొంత మంది బదిలీపై వెళ్లడంతో వైద్యులు కొరత నెలకొంది. దీంతో రోగులకు పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందక ఇబ్బందులు పడుతున్నారు. వైద్యుల కొరతతో వైద్య సేవలు అందక ప్రజలు నానా అవస్థలు పడుతున్నా కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైద్యుల కొరత గురించి కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ప్రజలు తెలుపుతున్నారు. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇద్దరు వైద్యులు సేవలు అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, యడ్లపల్లి

వేమూరు నియోజకవర్గంలో ఇలా...

వేమూరు నియోజకవర్గంలో 12 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. ఒక్కొక్క పీహెచ్‌సీకి ఇద్దరు చొప్పున 24 మంది వైద్యులు సేవలు అందించాల్సి ఉంది. ప్రస్తుతం 18 మంది వైద్యులు వైద్య సేవలు అందిస్తున్నారు. ఆరుగురి వైద్యుల కొరత ఉంది.

- వేమూరు మండలంలో ఒక పీహెచ్‌సీ ఉండగా ఇద్దరు వైద్యులు పనిచేస్తున్నారు.
- కొల్లూరు మండలంలో కొల్లూరు, దోనేపూడి 2 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. నలుగురు వైద్యులకు ముగ్గురు సేవలందిస్తున్నారు. కొల్లూరులో ఒక వైద్యుని కొరత ఉంది.
- చుండూరు మండలంలో 3 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. ఆరుగురు వైద్యులు సేవలు అందించాల్సి ఉండగా ఐదుగురు వైద్యులు ఉన్నారు. యడ్లపల్లి పీహెచ్‌సీలో ఒక వైద్యుని కొరత ఉంది.
- అమర్తలూరు మండలంలో 4 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. మొత్తం 8 మంది వైద్యులకు ఐదుగురు వైద్యులు సేవలు అందిస్తున్నారు. ముగ్గురు వైద్యుల కొరత ఉంది.
- భట్టిప్రోలు మండలంలో 2 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. భట్టిప్రోలు పీహెచ్‌సీలో ఒక వైద్యుని కొరత నెలకొంది.

వైద్య రంగంపై ప్రత్యేక దృష్టి

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వైద్య రంగంపై ప్రత్యేక దృష్టి సారించింది. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇద్దరు వైద్యులను నియమించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాక ముందు ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఒక వైద్యాధికారి పని చేసేవారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక రోగులకు పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందడం లేదని, పేద ప్రజలకు పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందించాలని ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇద్దరు వైద్యులను ఏర్పాటు చేశారు. గ్రామీణ ప్రాంతంలో ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు 104 వాహనం ఏర్పాటు చేశారు. 104 వాహనం ద్వారా వైద్యులు ప్రతి గ్రామంలో వైద్య సేవలు అందించడం జరిగింది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కూడా ప్రజలకు వైద్య సేవలు అందించడం జరిగింది.

వైద్యులను నియమించాలి



ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు కొరతతో సకాలంలో వైద్య సేవలు అందడం లేదు. కూటమి ప్రభుత్వం వెంటనే వైద్యుల నియామకం చేయాలి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ద్వారా వైద్య సేవలు అందించాలి.

– సయ్యద్ సిరాజుద్దీన్, భట్టిప్రోలు

కూటమి ప్రభుత్వం వైద్యులు గురించి పట్టించు కోదు



ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యుల కొరత గురించి కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ప్రభుత్వం వెంటనే వైద్యులను నియమిస్తే పేద ప్రజలకు వైద్య సేవలు అందుతాయి.

– తెనాలి పవన్ కుమార్, పెదపూడి, అమర్తలూరు మండలం

వైద్యుల కొరత ఉంది



వేమూరు నియోజకవర్గంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు కొరత ఉంది. యడ్లపల్లి పీహెచ్‌సీలో వైద్యులు బదిలీపై వెళ్లారు. మిగిలిన వైద్యులు పోస్టు గ్రాడ్యుయేషన్ పూర్తి చేసేందుకు వెళ్లడం వల్ల వైద్యుల కొరత నెలకొంది. ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతాం.

– డాక్టర్ వెంకట సురేష్, వైద్యాధికారి, పెరవలి

హామీలు నెరవేర్చడంలో కూటమి సర్కార్ విఫలం

ఎంబీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పెంద్ర వీరన్న

బాపట్లటౌన్: హామీలు నేరవేర్చడంలో కూటమి సర్కార్ ఘోరంగా విఫలమైందని ఎంబీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పెంద్ర వీరన్న తెలిపారు. కూటమి ప్రభుత్వం సంచార జాతులకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలన్నారు. మంగళవారం పట్టణంలోని సంచార జాతుల సంఘం కార్యాలయంలో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఎంబీసీ వర్గాలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేపడతామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఎంబీసీ వర్గాలకు స్థానిక సంస్థల్లో 5 శాతం రిజర్వేషన్లు, దేవాలయాల పాలక మండళ్లలో సభ్యత్వాలు, మున్సిపల్, మున్సిపల్ కార్పొరేషన్‌లో ఎస్సీ మైనార్టీల వలే కో ఆప్షన్ సభ్యులుగా అవకాశం, ఎంబీసీ వర్గాల వారికి 100 యూనిట్ల నుంచి 200 యూనిట్ల ఉచిత విద్యుత్ సరఫరా, ఆ సామాజిక వర్గాల వారికి గుర్తింపు కార్డులు అందిస్తామని చెప్పి కూటమి ప్రభుత్వం మేనిఫెస్టోలో పెట్టి అధికారం వచ్చి పది నెలలు గడుస్తున్నా ఇంతవరకు ఆ సామాజిక వర్గాలను పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. అలాగే ఎంబీసీ కార్పొరేషన్ పాలక మండలి చైర్మన్, డైరెక్టర్లను ఇంతవరకు ప్రకటించలేదని, కూటమి ప్రభుత్వానికి సంచార జాతులు పట్ల ఏమాత్రం చిత్తశుద్ధి లేదని ఆయన దుయ్యబట్టారు. త్వరలో మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను నెరవేర్చకపోతే రాష్ట్ర వ్యాప్తంగా సంచార జాతులు సంఘం ఆధ్వర్యంలో ఉద్యమం చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో సంచార జాతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చల్లా రామయ్య, కత్తుల గోపి, దార్ల సురేష్, చల్లా చిరంజీవి, కత్తుల వెంకటేశులు, చల్లా కొండయ్య, కత్తుల కోటయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంబీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పెంద్ర వీరన్న

పీఎంఏవై గృహాల పరిశీలన

చుండూరు(వేమూరు): పీఎంఏవై అర్బన్ గృహ నిర్మాణం పూర్తి చేయాలని ఎంపీడీవో ఎస్.సుదీప అన్నారు. చుండూరు మండలంలోని చినపరిమి గ్రామంలో గృహ నిర్మాణ లబ్ధిదారులతో సమావేశం మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వంలో వివిధ దశల్లో నిలిచిపోయిన ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని లబ్ధిదారులకు తెలియజేశారు. వివిధ దశల్లో నిలిచిపోయిన ఇళ్లు పూర్తి చేసేందుకు ప్రభుత్వం అదనంగా నిధులు మంజూరు చేయడం జరుగుతుందని ఆమె చెప్పారు. ఎస్సీ, బీసీలకు అదనంగా రూ.50 వేలు, ఎస్టీలకు అదనంగా రూ.75 వేలు అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మేరుగ సుభాషిణి, ఎంపీటీసీ అవుతు శివపార్వతి, గ్రామ ఉప సర్పంచ్ అవుతు సాయిబాబా రెడ్డి, మర్రెడ్డి అయ్యప్ప రెడ్డి, దాసరి రాంబాబు, ఉన్నం తరుణ్, తమ్మా పాముల రెడ్డి, గృహ నిర్మాణం ఏఈ శ్రీనివాసరరావు, పంచాయతీ కార్యదర్శి వినయ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



చినపరిమి గ్రామంలో వివిధ దశల్లో నిలిచిపోయిన ఇళ్లు పరిశీలించిన ఎంపీడీవో సుదీప

●వైవీ సుబ్బారెడ్డిని పరామర్శించిన అశోక్‌బాబు



వైఎస్సార్‌సీపీ ఉమ్మడి గుంటూరు జిల్లాల రీజనల్ కో ఆర్డినేటర్, రాజ్యసభ సభ్యులు వైవీ సుబ్బారెడ్డి మాతృమూర్తి పిచ్చమ్మ (85) పార్థివ దేహానికి మంగళవారం పార్టీ వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు నివాళులర్పించారు. సుబ్బారెడ్డిని ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. - భట్టిప్రోలు

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

ఎంఈవో శోభాచంద్

నిజాంపట్నం: వేసవిలో విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎంఈవో-1 శోభాచంద్ ఉపాధ్యాయులకు సూచించారు. వార్షిక తనిఖీలలో భాగంగా అడవులదీవి క్లస్టర్ తాళ్ళతిప్ప గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను మంగళవారం సందర్శించారు. ప్రస్తుతం వేడిమి అధికంగా ఉన్న నేపథ్యంలో విద్యార్థులు ఎండలో తిరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి తరగతి గది ఆవరణలో తాగునీటిని ఏర్పాటు చేయాలన్నారు. గంటకోమారు విద్యార్థులు తాగునీరు తాగేవిధంగా చైతన్య పరచాలన్నారు. మధ్యాహ్న భోజనం ఎటువంటి నాణ్యతా లోపం లేకుండా భోజన నిర్వాహకులు వండాలని, చిన్నారులకు సక్రమంగా భోజనం అందేలా పర్యవేక్షించాలన్నారు. పాఠశాలలో జరిగే నిత్యకృత్యాలను విధిగా రికార్డులలో నమోదు చేయాలని, రికార్డుల నిర్వహణలో లోపం జరిగితే సహించేదిలేదని చెప్పారు. ఈ సందర్భంగా రికార్డులను, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈవో-2 శేషుగోపాలం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులతో కలిసి మంచినీటిని తాగుతున్న ఎంఈవోలు శోభాచంద్, శేషుగోపాలం

ఐలవరంలో ప్రజా చైతన్య యాత్ర

సీపీఎం బృందానికి సమస్యలు విన్నవిస్తున్న ప్రజలు

ఐలవరం(భట్టిప్రోలు): ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకునేందుకు సీపీఎం ప్రజా చైతన్య యాత్ర మంగళవారం భట్టిప్రోలు మండలం ఐలవరం దళితవాడలో నిర్వహించడం జరిగింది. సీపీఎం పార్టీ బాపట్ల జిల్లా కార్యవర్గ సభ్యులు టి.కృష్ణ మోహన్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను అర్హులైన వారికి అందజేయాలని పేర్కొన్నారు. మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల శిథిలావస్థకు చేరిందని నూతన భవన నిర్మాణం, కమ్యూనిటీ హాలు, అంగన్‌వాడీ కేంద్రాలు నిర్మించాలని కోరారు. ప్రజలు పడుతున్న ఇబ్బందులను సీపీఎం బృందానికి తెలియజేశారు. సమస్యల పరిష్కారం కోసం సీపీఎం పార్టీ ఆందోళన చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం మండల నాయకులు మురుగుడు సత్యన్నారాయణ దీపాల సత్యన్నారాయణ, పి.మనోజ్‌కుమార్, ఐలవరం శాఖ కార్యదర్శి బసవయ్య, పార్టీ సభ్యులు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



ఐలవరంలో సమస్యలు పరిష్కరించాలని కోరుతున్న సీపీఎం ప్రజా చైతన్య యాత్ర నిర్వాహకులు

రౌడీ మూకలు.. చిల్లర చేష్టలు

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని తరచుగా రౌడీ మూకలు ఏదో ఒక ప్రాంతంలో అల్లర్లు సృష్టించి, ప్రజలను భయభ్రాంతులకు గురిచేయడం పరిపాటిగా మారింది. తాజాగా మంగళవారం తెల్లవారుజామున ఉండవల్లి కోలా సుబ్బారావు బజారులో ఇలాంటి ఘటనే చోటుచేసుకుంది. కాసరనేని శ్రీనివాసరావు అనే యువకుడు ఉండవల్లి దేవుడి మాన్యంలో రెండేళ్ల క్రితం హోమం నిర్వహించాడు. అప్పట్లో టెంట్లు ఏర్పాటు చేసిన వారు వాటిని తీసుకువెళ్లకుండా అక్కడే వదిలివేయడంతో వాటిని గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. ఆ విషయంలో తనకు సంబంధం లేదని కాసరనేని శ్రీనివాసరావు తేల్చి చెప్పాడు. టెంట్లు వేసిన వారికి డబ్బు లు కూడా ఇచ్చేశాడు. అదనంగా తనకు డబ్బులు ఇవ్వాలంటూ తరచుగా టెంట్ల యజమాని పెండ్యాల రమేష్ శ్రీనివాసరావును బెదిరిస్తున్నాడు. శ్రీని వాసరావు ససేమిరా అనడంతో విజయవాడ నుంచి పది నుంచి పదిహేను మంది రౌడీ మూకలను తీసుకువచ్చి సోమవారం అర్ధరాత్రి నుంచి మంగళవారం తెల్లవారుజాము వరకు సుమారు 4 గంటల పాటు శ్రీనివాసరావు ఇంటి తలుపులు కొడుతు, బూతులు మాట్లాడుతూ ఇంటి ఆవరణలో అర్ధనగ్నంగా నిలబడి నానా యాగీ చేశారు. దాంతో శ్రీనివాసరావు 100కు ఫోన్ చేయడంతో పోలీసులు ఘట నా స్థలానికి చేరుకున్నారు. దాంతో అక్కడ ఉన్న రౌడీమూకలు ఒక్కొక్కరుగా వెళ్లిపోయారు. ఈ ఘటనపై తాడేపల్లి పోలీసులకు శ్రీనివాసరావు ఫిర్యాదు చేశారు. తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఇలాంటి సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ఉండవల్లి సెంటర్‌లో ఒక వ్యక్తి షాపింగ్ కాంప్లెక్స్‌లో షాపు అద్దెకు తీసుకుని హోటల్ నిర్వహిస్తున్నాడు. ఆ కాంప్లెక్స్ యజమాని షాపు ఖాళీ చేయాలంటూ హోటల్ యజమానిపై వత్తిడి తీసుకువచ్చాడు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

దుగ్గిరాల: దుగ్గిరాల మండలంలో పెసర కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కానున్నాయి. రైతులు ఎంఎస్‌పీ ధర కంటే తక్కువ ధరకు అమ్ముకోవద్దని అధికారులు తెలిపారు. పంట నమోదు, ఈ-కేవైసీ చేయించుకున్న రైతులు రైతు సేవా కేంద్రాలలో పంట వివరాలు తెలియజేసి కొనుగోలుకు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని పేర్కొన్నారు. క్వింటాకు ఖరీఫ్ వరి రూ.2,300, జొన్న రూ.3,331, మొక్కజొన్న రూ.2,225, పెసర రూ.8,682, మినుము రూ.7,400, వేరుశనగ రూ.6,783 ధరలు నిర్ణయించారు. రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వ్యవసాయంపై శాస్త్రీయ అవగాహన ఉండాలి

తెనాలిటౌన్: వ్యవసాయంపై రైతులు శాస్త్రీయ అవగాహన కలిగి ఉండాలని బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు సూచించారు. మంగళవారం రూరల్ మండలం కఠెవరం గ్రామంలో ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వ్యవసాయ కళాశాల బాపట్ల విద్యార్థులు రైతులకు ఆధునిక వ్యవసాయం, శాస్త్రీయ పద్ధతులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామ వ్యవసాయ సహాయకురాలు వాణి, విద్యార్థులు పాల్గొని గ్రామస్థాయిలో పంట పంపిణీ, లింగ నిష్పత్తి, వృత్తి విభజన, రైతుల వర్గీకరణ వంటి అంశాలను చార్ట్ రూపంలో, రంగవల్లులు ద్వారా తెలియజేశారు. రైతులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు తెలుసుకున్నారు. వ్యవసాయ వనరులను గుర్తించేందుకు గ్రామ మ్యాపింగ్, రైతుల ప్రయాణ మార్గాలను అంచనా వేయడానికి మొబిలిటీ మ్యాప్ రూపొందించారు. గ్రామ సమీపంలో ప్రభుత్వ సంస్థలు, వాటి ప్రాముఖ్యతను చాప్టర్ డయాగ్రామ్ ద్వారా వివరించారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ కళాశాల విద్యార్థులు

స్వయం ఉపాధి రుణాలకు 22 చివరి తేదీ

భట్టిప్రోలు : బీసీ కార్పొరేషన్, ఈడబ్ల్యూఎస్, కాపు కార్పొరేషన్‌కు సంబంధించి స్వయం ఉపాధి రుణాలకు ఈ నెల 22 చివరి తేదీ అని ఎంపీడీవో ఎస్.వెంకట రమణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో అర్హులైన యువతీ యువకులకు తెలియ చేయడమైనదని పేర్కొన్నారు. ఆయా రుణాలకు దరఖాస్తు చేసుకోవాల్సిందిగా కోరారు.

బార్ అసోసియేషన్‌కు ఎన్నికలకు 19 నామినేషన్‌లు

రేపల్లె రూరల్: రేపల్లె న్యాయవాదుల సంక్షేమ సేవా సంఘం 2025-26 సంవత్సరానికి నూతన కార్యవర్గ ఎన్నికకు రెండు రోజుల నుంచి నిర్వహిస్తున్న నామినేషన్‌ల స్వీకరణ కార్యక్రమం మంగళవారంతో ముగిసింది. నూతన కార్యవర్గంలోని వివిధ పదవులకు మొత్తం 19 నామినేషన్‌లు దాఖలైనట్లు ఎన్నికల అధికారి గుజ్జర్లమూడి ప్రశాంత్‌కుమార్ తెలిపారు. అధ్యక్ష పదవికి 2 నామినేషన్‌లు, ఉపాధ్యక్ష, జనరల్ సెక్రటరీకి, జాయింట్ సెక్రటరీ, లైబ్రేరియన్ సెక్రటరీ, ట్రెజరర్, స్పోర్ట్స్ సెక్రటరీ, మహిళా ప్రతినిధి పదవులకు రెండేసి చొప్పున, ఎగ్జిక్యూటివ్ మెంబర్ పదవికి మూడు నామినేషన్‌లు దాఖలైనట్లు చెప్పారు. 19వ తేదీన నామినేషన్‌ల పరిశీలన, సాయంత్రం 4 గంటల వరకు ఉపసంహరణ కార్యక్రమం ఉంటుందన్నారు. 26న ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు పోలింగ్, అదే రోజు లెక్కింపు, అనంతరం గెలుపొందిన అభ్యర్థుల ప్రకటన జరుగుతుందన్నారు.

ఉచిత విద్యుత్ పథకానికి జీవో విడుదల చేయాలి

బాపట్ల జిల్లా కార్యదర్శి మురుగుడు సత్యన్నారాయణ

భట్టిప్రోలు: చేనేత కార్మికులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకానికి వెంటనే జీవో విడుదల చేయాలని ఏపీ చేనేత కార్మిక సంఘం బాపట్ల జిల్లా కార్యదర్శి మురుగుడు సత్యన్నారాయణ డిమాండ్ చేశారు. మంగళవారం భట్టిప్రోలులోని ప్రజా సంఘాల కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇప్పటికి ఉచిత విద్యుత్ గూర్చి మూడు సార్లు ప్రకటించిందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కల్లిబొల్లి మాటలను కట్టి పెట్టి వెంటనే చేనేత కార్మికులకు ఉచిత విద్యుత్‌కు సంబంధించిన జీవోను విడుదల చేసి ఎన్నికల ముందు చేసిన వాగ్దానాలను నిలుపుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు డి.సత్యన్నారాయణ, జిల్లా కమిటీ సభ్యులు బి.నాగమల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

19, 20 తేదీలలో ఉచిత ధ్యాన యోగా కార్యక్రమం

భట్టిప్రోలు: భట్టిప్రోలు మండలం వెల్లటూరు ఆర్య వైశ్య కల్యాణ మండపంలో ఈ నెల 19, 20 తేదీలలో సాయంత్రం 5 గంటలకు సహజ యోగా ధ్యాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు మంగళవారం తెలిపారు. మాతాజీ నిర్మాలాదేవి ఆశీస్సులతో ఈ కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు. సహజ యోగ ధ్యానం ద్వారా ఆత్మ సాక్షాత్కారం పొందడం అనే చాలా సరళమైన, సాధారణమైన ప్రక్రియను ఆమె ప్రవేశ పెట్టారన్నారు. ప్రపంచ వ్యాప్తంగా సహజ యోగా ధ్యాన సాధన ద్వారా ఆనందం పొందుతున్నారని, ఈ సహజ యోగా ధ్యానం ఉచితంగా నేర్పబడునని వివరించారు. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని పేర్కొన్నారు.

పశువులకు గాలికుంటు టీకా

ఫిరంగిపురం: మండలంలోని యర్రగుంట్లపాడు గ్రామంలో మంగళవారం నుదురుపాడు పశువైద్యశాల ఆధ్వర్యంలో పశువులకు గాలి కుంటు వ్యాధి టీకా వేసినట్లు పశువైద్యాధికారి పీర్ అహ్మద్ తెలిపారు. 300 గేదెలు, 20 ఆవులకు టీకాలు వేసామని వెల్లడించారు. ఇప్పటికే నుదురుపాడు, ఫిరంగిపురం పశువైద్యశాలల పరిధిలో టీకా వేసినట్లు తెలిపారు. మిగిలిన వారు తమ పశువులకు టీకా వేయించుకోవాలని పేర్కొన్నారు.

అర్హులకు రుణాలు

తాడేపల్లిరూరల్: ఎస్సీ సామాజిక వర్గంలో అర్హులైన వారందరికి రుణాలు ఇచ్చే అవకాశాలను పరిశీలిస్తున్నట్లు మాదిగ కార్పొరేషన్ చైర్మన్ ఉండవల్లి శ్రీదేవి తెలిపారు. మంగళవారం తాడేపల్లి బైపాస్ రోడ్‌లోని ఆమె కార్యాలయంలో కార్పొరేషన్ అధికారులు, ముఖ్య బాధ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు పేదల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, పేదలను ఆర్థికంగా పరిపుష్టి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ మేనేజర్ కృష్ణవేణి, పలువురు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

వటపత్ర అలంకారంలో నారసింహుడు

మంగళగిరి టౌన్: మంగళాద్రిలో వేంచేసి యున్న లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో ఆస్థాన అలంకారోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామి వారు వటపత్ర అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామి వారిని దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో భక్తులు విచ్చేశారు. తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఉత్సవాన్ని ఈవో రామకోటిరెడ్డి పర్యవేక్షించారు. అలంకార ఆస్థాన కైంకర్యపరులుగా హైదరాబాద్‌కు చెందిన మేళ్ల చెరువు సీతామహాలక్ష్మి వ్యవహరించారు.